కవితా కౌముది

# బతుకు ముఖచిత్రం

బండారి రాజ్ కుమార్

సొక్క నిదురలో...
పల్లేరుగాయల పరుపు మీద పెయ్యిగందకుండ అటీటు బొర్రుతాంటె
నీ కలలకు నెత్తురు మరకలేమన్న అంటుకున్నయో..ఏందో ?
పాలలో నీళ్లలెక్క కల్సిపోతవని సూశినోల్లందరు మొకబిల్లబడుతాంటె సంబురమైతాంటది
సూశీసూడంగనే గిచ్చిగాయంబెట్టుకునుడు కొత్తగాదని గులిగేటోల్లుంటరు
నపరింత సుంచుకుంట పంచుకుతిన్న దృశ్యాలే తెరముందు తైతక్కలాడుతయి
తెరెనక భాగోతాల సంగతి..దినాం శాటల నిప్పులుజెరిగినట్టేనని గుసగుసలాడుతరు

ఎంగిలి మెతుకులు గతుకుడు
పందిరిగుంజకు తీగల్లుకున్నట్టు పాయిరంగ అమురుకునుడు
మొగలి పొట్టెల వాసన గుప్పుమనుడు
పూతేనె సంబురాల్ని ఉయ్యాలగట్టి జోకొట్టుడు
మందపు చర్మం కింద పల్సని యేరు పారుడు..ఎటమటమైతే పోటెత్తుడు
మొసమొర్రక అవుగోలిచ్చుడే బతుకని సరిపెట్టుకునుడు
అంతా....ఓ లీలగా కండ్లముందు బొమ్మగడుతాంటయి

లడాయిలెన్నిజేసినా..
అక్కెరకు వుసిగొల్పే ఉపాయాలేనని తేటతెల్లమైతది
ఎంత జిద్దుజేశినా గుప్పిటబట్టుకుని  కూసున్న బతుకుముఖచిత్రం నిత్తె కొట్లాటేనని ఖరారైతది
సింగిడి రంగుల పరదా మాటున నలిగే చీకటి బతుకుల చిక్కుల పాయల్లో ఎడబాయని
ఊగిసలాట తప్పదని మతిలబడుతది
రంగమెక్కి మనమెన్ని చిందులు తొక్కినా
కొస్సకు బొంకిచ్చి  బోర్లిచ్చే ఉశ్కెతప్పెడిగాళ్ల  పెడమాటకారితనాలే నెగ్గుకొత్తాంటయి.

****

## దహించేస్తా..!!
### సుజాత పి.వి.ఎల్

నీ మాటకై
అలమటించే నేను
ఒక్క మాటతో
ఉప్పెనై ముంచెత్తావు
కన్నీరు మున్నీరవుతున్న
నన్ను చూసి విరగబడి విర్రవీగావు..
నిస్సహాయురాలిని చేసి నిందించావు..
నువ్వే నా జీవితం
అనుకున్న నా గుండెకు
ఎడారి సెగలను చూపించావు
ఇదేమని ప్రశ్నించిన నన్ను
ఆరడుగుల నేలలో నన్నుంచి
మూడడుగుల దూరంలో నిలుచుని
చోద్యం చూస్తున్నావు!
నిన్ను మోస్తున్న అవని నవ్వుతోంది
నీ నటనని చూసి..
తలెత్తి ఒక్కసారి చూస్తే
తెలుస్తుంది ఆకాశం నీపై
విరుచుకుపడ్డానికి
ఎంత సిద్ధంగా ఉందో!
నా ఉసురు నీకు
వీడ్కోలు పలికే లోపే
నా ముందునుండి వెళ్ళిపో..!
నేను శవమై పూర్తిగా
దహనమవ్వక ముందే
నెమ్మదిగా జారుకో
లేదంటే..శవమై నిన్ను
దహించేస్తా..!!

★★★★

## చూపుల రూపాలు
### అల్లూరి గౌరీలక్ష్మి

మౌనంలో చూపులు మానవ రూపం దాల్చి
మనుషుల్ని ఆప్యాయంగా అలముకుంటై
అవి కళ్ళతోనే అభిమానంగా పలకరిస్తాయి

కొన్ని దూరం నుంచే చేతుల్తో ఆకాశానికి ఎత్తితే
కొన్ని దగ్గరగా వచ్చి స్నేహంగా హత్తుకుంటాయి
కొన్ని తూపులల్లే  చురుక్కున మండి
ఆపై కఠినమైన కంటకాల్లా గుచ్చుతుంటై

కొన్ని వాత్సల్యాన్ని కురిపిస్తుంటాయి
కొన్ని మనల్ని కెమెరాలా ఫోటోలు తీస్తే
కొన్ని అసూయతో అసహనం చిందిస్తాయి

కొన్ని జల్లుల్లా అభిమానం కురిపిస్తే
కొన్ని చిరునవ్వుతో స్నేహాభిషేకం చేస్తాయి
కొన్నిస్కాన్ చేసి రికార్డు చేస్తున్నట్టుంటై

అల్లిబిల్లిగా అలా తాకి పోతుంటాయి కొన్ని
ఆగి నిదానించి హాయిగా నవ్వుతాయి కొన్ని
కొన్ని పాపాయిల్లా ముట్టుకుని పారిపోతుంటే
కొన్ని పరకాయించి చూసి దూరంగా నిలుస్తాయి

ఆఖర్న నోరు విప్పగానే ఊహల తెరలు తొలగిపోయి
నడుస్తున్న కథాచిత్రాలు మొత్తం మారిపోతాయి
అపుడు కొత్త  ప్రపంచాలు ఆవిష్కృతమై
కొనసాగుతై…

****

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

అడుగులెన్నడు తిన్నగా పడవిదేమి?
ఎప్పుడును తడబడి దారి తప్పుచుండు
తిరిగి సరియైన బాటపైనరుగుచుండు
మనసెరుంగదో సరియైన మార్గమేదొ!

మనసెరుంగును సరియైన మార్గమేదొ
తెలియు వేరొక గమ్యము వలయునంచు
ఎదురుకొను రెండు మార్గమ్ములెడద యందు
ఓటమేలనో కోరిన వాటికెపుడు!

మనుజులెల్లరునొక్కటే మార్గమందు
అరుగవలెనని నిర్ణయమైనదిచట
ఎవ్వరీ పథముల నిర్ణయించిరెపుడు?
ఏది సక్రమమౌ మార్గమేది కాదు?

పదుగురనుసరించెడు బాట పాటియైన
నేటిదాక బాట నిన్నటి బాట వేరు
వేరుదేశమ్ములందుండు వేరు తీర్లు
ఏది సరియైనదో మరి యేది కాదొ!

ఏప్రమాణము మదిని శాశించుచుండు
దానికే ప్రమాణమెటులాధారమయ్యె?
అఖిలజనులకు వర్తింపనట్టి దారి
తలప కొందరికే శిరోధార్యమేల?

COMMENTS